తలుపులమ్మ తల్లికి పూజలు



కూకట్‌పల్లి: ఏవీబీ పురంలోని తలుపులమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పూజలు నిర్వహించారు. పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ గుట్ట ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. మంగళవారం కాలనీ వాసులు ఆమెను కలిసి సమస్యను వివరించారు. తగిన నీటి సరఫరా లేకపోవడంతో ప్రతి రోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. జలమండలి మేనేజర్ అన్విత్‌ను పిలిపించి కార్పొరేటర్ నీటి సమస్యను వివరించారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పర్వత్‌నగర్ గుట్ట ప్రాంతానికి తగినంత నీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కల్యాణ్ నాయక్, సంజీవ, ఉమ్లా నాయక్, అనంతయ్య, బాలస్వామి, గోపాల్‌నాయక్, దేశాలు నాయక్, కుమార్, రాధ, అంజమ్మ, కలమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

గన్‌పార్కుకు తరలిన మలిదశ ఉద్యమకారులు



మోతీనగర్: తెలంగాణ మలి దశ ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు మలిదశ ఉద్యమకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గన్ పార్కు వద్ద జరిగిన ఉద్యమకారుల సమావేశానికి మంగళవారం మోతీనగర్ నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎంతోమంది అమరవీరుల త్యాగాలతోనే రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు. మలిదశ ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డు జారీ చేయాలని, అదే విధంగా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యమకారుడుకి ఇళ్లు అందజేయాలని కోరారు.

హౌసింగ్‌బోర్డు భూముల వేలం

సరికాదు

- అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం విఫలం
- హౌసింగ్‌బోర్డు స్థలాల్లో పార్కులు ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సిద్ధి వినాయక ఆలయం పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి అభివృద్ధికి పైసా ఇవ్వకుండా వేల కోట్ల రూపాయల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూముల వేలంపై కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిద్ధి వినాయక ఆలయం పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1400 ఎకరాలలో ఏర్పాటైన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు స్థలంలో 10 శాతం భూమిని ప్రజల వినియోగార్థం కేటాయించటం జరిగిందని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అటువంటి భూములను సైతం వేలం వేస్తున్నదని విమర్శించారు. మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్ల రోడ్డు ఉండగా, హౌసింగ్ బోర్డు అధికారులు మాత్రం తమ ప్లాన్‌లో 40 ఫీట్ల రోడ్డు చూపిస్తూ మిగిలిన స్థలాన్ని వేలం వేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన భూములను వేలం వేసిందన్నారు. కానీ ఈ 18 నెలల్లో కూకట్‌పల్లి నియోజకవర్గానికి 18 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేయటం కాకుండా వాటిని పరిరక్షించి వాటిలో పార్కులు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఉపయోగపడేలా చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో సుమారు 5 వేల కోట్ల రూపాయల విలువైన హౌసింగ్‌బోర్డు భూములను వేలం వేయనున్నదని, ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శిరీష బాబూరావు, సతీష్ అరోరా, కృష్ణారెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

కూకట్‌పల్లి: వర్షాకాలం దృష్ట్యా కార్పొరేటర్‌లు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్‌లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. నిత్యం ప్రజల్లో తిరిగి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్‌లు పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష, మహేశ్వరి శ్రీహరి, మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్, బాబూరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌లతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే

స్థలం కేటాయించాలని వినతి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో క్రైస్తవ ప్రార్థన మందిరం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో తెలంగాణ హౌసింగ్ బోర్డు ఐఏఎస్ అధికారి వి.పి. గౌతంకు మంగళవారం వినతిప్రతం అందజేశారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో వేలాది మంది జీవనం సాగిస్తున్నారని, వీరికి అనువైన స్థలంలో ప్రార్థన మందిరం నిర్మించుకునేందుకు వీలుగా స్థలాన్ని కేటాయించాలని కోరారు. గతంలో చర్చి నిర్మాణం కోసం కొంత స్థలం కేటాయించినప్పటికీ హౌసింగ్ బోర్డు అధికారులు ఆ స్థలాన్ని ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో క్రైస్తవులకు ఉమ్మడిగా ప్రార్థనలు చేసుకునేందుకు స్థలం లేకుండా పోయిందన్నారు. అదే విధంగా హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం నిత్యం వందలాది మంది భక్తుల రాకతో దివ్య క్షేత్రంగా మారిందని, నిత్యం రద్దీగా ఉండే ఈ ఆలయంలో భక్తుల సేవకు, ఇతర వసతి సౌకర్యాలకు అనువుగా ఉన్న హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాన్ని ఆలయానికి కేటాయించటం అన్ని విధాలుగా సబబుగా ఉంటుందని మరో వినతిపత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. వెంటనే వరసిద్ధి వినాయక స్వామి ఆలయం పక్కన ఉన్న సుమారు 200 గజాల స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కిట్ల పంపిణీ



బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి భద్రత కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందజేసిన 11 రకాల సామాన్లు ఉన్న కిట్లను ఉపయోగించుకొని ఆరోగ్యాలను సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ మనోహర్ రెడ్డి, ఎస్ఆర్‌పీ నర్సింగ్‌రావు, ఎస్ఎఫ్ఏ పండు నాయక్, భోళా శంకర్, నాగసూరి మహేష్, నాయకులు ఎలిజాల యాదగిరి, మహ్మద్ బాబా, కార్మికులు పాల్గొన్నారు.

సర్వ మతాలను గౌరవించాలి



ఎమ్మెల్యే, కార్పొరేటర్లను సన్మానిస్తున్న మత పెద్దలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మన దేశం, రాష్ట్రం సర్వమతాలకు నిలయమని, సర్వమతాలను గౌరవించడం అందరి బాధ్యతని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని హజ్రత్ సయ్యద్ నసిరుద్దీన్ షా ఖాద్రి దర్గ ఉర్సు ఉత్సవాలలో ఆయన కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, జూపల్లి సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, మత పెద్దలు అప్సర్, ముస్తాక్, మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావు, దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మోతీనగర్: పర్యావరణానికి హాని కలిగించే ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులైన పూర్తిగా నిషేధించాలని లయన్స్ క్లబ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం నగరంలోని పలు రైతు బజార్లు, సంతల వద్ద బట్టలతో తయారు చేసిన గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ సంచులతో అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు గుడ్డ సంచులను వెంట తీసుకువెళ్లాలని సూచించారు.



కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సమతనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. అదే విధంగా కిట్‌లో అందజేసిన జాకెట్ వేసుకోవటం వల్ల ఉదయం, రాత్రి వేళల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కాపాడుకోవచ్చన్నారు. అదే విధంగా గ్లౌస్‌లు, సబ్బులు, నూనె తదితర సామాగ్రిని వినియోగించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని ఆలీ తలాబ్ చెరువు వద్ద అలుగు తూము నిర్మాణం, వ్యర్థ నీరు పైపులైన్ పనులను ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులతో మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, వాటర్‌వర్క్స్ సూపర్ వైజర్ నరేంద్ర, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కూకట్‌పల్లి: కేబీపీహెచ్‌బీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యపరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకుడు గాదె శివ చౌదరి అన్నారు. మంగళవారం కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ మెంబర్ బాబ్జీకుమార్, రమణ, హరిప్రసాద్ నాయుడు, వరుణ్, కృష్ణయ్య, రాము, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

